సాక్షి
పల్నాడు
ఆదివారం । 4 । ఫిబ్రవరి । 2024



గోదావరి ఝరిలా గాత్రకచేరి

చీరాల అర్బన్: సంగీత సద్గురు త్యాగరాజ స్వామి వారి ఆరాధనోత్సవాలలో భాగంగా చీరాలలో శనివారం రాత్రి చెన్నైకు చెందిన ఆదిత్య మాధవన్ గాత్ర కచేరి నిర్వహించారు.



జిల్లా జడ్జిని కలిసిన ఎస్పీ

పట్నంబజారు: గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథిని మర్యాదపూర్వకంగా కలిశారు.

ఆంజనేయుడికి నాగవల్లీ దళార్చన



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని దక్షిణాముఖ ఆంజనేయ స్వామికి శనివారం పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం నాగవల్లీ దళాలతో అష్టోత్తర, సహస్రనామ పూజలు చేశారు.

న్యూస్‌రీల్

రామలింగేశ్వరస్వామి దేవాలయ నిర్మాణానికి భారీ విరాళం



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని కొండపైన పునఃనిర్మాణం జరుగుతున్న గంగా పార్వతి సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయానికి పారిశ్రామికవేత్త, స్పిన్నింగ్ మిల్ అధినేత దండే బ్రహ్మానందం రూ.25 లక్షలు చెక్కును వినుకొండ పట్టణ అభివృద్ధి సేవా సంఘం సభ్యులకు అందజేశారు. దాత దండే బ్రహ్మానందంను సభ్యులు సత్కరించారు. దేవాలయ నిర్మాణంలో అవకాశం కల్పించిన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకు దాత ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు పెండేల పుల్లారావు, అధ్యక్షులు పులిపాటి రామారావు, సెక్రటరీ జాజుల మాల్యాద్రి, ట్రెజరర్‌రెడ్డి నగేష్‌బాబు, వైస్ ప్రెసిడెంట్ గంధం బాలిరెడ్డి, ములకా రామతులసిరెడ్డి, గజవల్లి పవన్, దండు చెన్నయ్య, జాగర్లమూడి సుబ్బారావు, కన్నెగండ్ల అనంత కోటేశ్వరరావు, చందోలు మల్లికార్జునరావు, గోవిందనాయక్, తేలికపల్లి బాబు, అచ్యుత కృష్ణ, కొత్తమాసు శివ, అన్న సుబ్బారావు, బండారు సుబ్బారావు పాల్గొన్నారు.

13 నుంచి విజయకీలాద్రి వార్షిక బ్రహ్మోత్సవాలు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్ర 7వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 13వ తేదీ నుంచి 18 వరకు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్టు జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు అన్నారు. శనివారం చిన్న జీయర్ ఆశ్రమంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలను త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్‌స్వామి ప్రారంభిస్తారని తెలిపారు. శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఆరు రోజులపాటు ఈ బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. అనంతరం త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మధుసూదనాచార్యులు చలసాని ఆంజనేయులు, రఘునాథాచార్యులు, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

సమతా దీక్షలో భాగంగా విస్తృత ప్రచారం

తాడేపల్లిరూరల్: సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై సమతా దీక్షను శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి మంగళ శాసనాలతో త్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఉదయం సమతా దీక్ష నిర్వహించామని, వేద విద్యార్థులు, అధ్యాపకులు, కోలాట బృందంతో నగర సంకీర్తన నిర్వహించామని తెలిపారు.

పశురక్షణకు ప్రాధాన్యం

- అమలులో వైఎస్సార్ పశు బీమా పథకం
- ప్రీమియం చెల్లింపుల్లో రాయితీ
- మూడేళ్ల కాలానికి లబ్ధిదారుల వాటా కింద 20 శాతం
- పశువులు మృత్యువాత పడినా, ప్రమాదానికి గురైనా పరిహారం
- జిల్లాలో 57.28 లక్షల పశు సంపద



సత్తెనపల్లి: గ్రామీణ ప్రాంత రైతులు వ్యవసాయం తర్వాత పాడి పరిశ్రమకే అధిక ప్రాధాన్యమిస్తారు. ప్రకృతి వైపరీత్యాలు, నీటి కాలుష్యం, పాముకాటు, అడవి జంతువుల దాడి, వివిధ ప్రమాదాలు, వాతావరణ మార్పులతో పశువులు వివిధ రకాల వ్యాధుల బారిన పడి మరణిస్తుంటాయి. పశువులు, జీవాలు మృత్యువాత పడితే వాటి స్థానంలో కొత్త వాటిని కొనుగోలు చేయడానికి పెంపకందారులు ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ఈ పరిస్థితుల్లో పాడి రైతులకు అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ పశు బీమా పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకం కింద రైతు చెల్లించాల్సిన బీమా ప్రీమియం వాటాల్లో కూడా ప్రభుత్వం రాయితీ కల్పిస్తోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసే ఈ పథకంతో ఏదైనా కారణంతో పశువులు మరణిస్తే వాటి యజమానులకు ఆర్థికంగా ఊరట కలిగించేలా పథకాన్ని రూపొందించారు. ఈ పథకం ద్వారా ఏడాది నుంచి మూడేళ్ల వరకు బీమా చేసుకునే వెసులుబాటు ఉంది.

ప్రీమియం చెల్లింపు ఇలా...

పశు బీమా పథకానికి తెల్ల రేషన్‌కార్డు కలిగి ఉన్న ఎస్సీ, ఎస్టీ రైతులతోపాటు బీపీఎల్ రైతులు తమ వాటాగా 20 శాతం, మిగిలిన వారు 50 శాతం ప్రీమియంగా చెల్లించాలి. రూ.30 వేల విలువైన పశువులకు మూడేళ్ల కాలానికి ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ వారు తమ వాటా కింద ఒక్కో పశువుకు రూ.384, మిగిలిన వారు రూ.960 బీమా ప్రీమియంగా చెల్లించాలి. దేశవాళీ పశువులకు రేషన్ కార్డుదారులు రూ.192, మిగిలిన వారు రూ.480 ప్రీమియంగా చెల్లించాలి. గొర్రెలు, మేకలకు బీపీఎల్ ఎస్సీ, ఎస్టీ, పేద వర్గాల వారు ఏడాదికి రూ.36, రెండేళ్లకు రూ.54, మూడేళ్లకు రూ.75 చెల్లించాలి. ఇతర వర్గాలకు చెందిన రైతులు ఏడాదికి రూ.90, రెండేళ్లకు రూ.135, మూడేళ్లకు రూ.187.50 చెల్లించాలి. మరింత అధిక ధరకు బీమా చేయించాలనుకుంటే పశువుల విలువను బట్టి ఎస్సీ, ఎస్టీ వర్గాల వారు 7.68 శాతం, ఇతర వర్గాల వారు 9.5 శాతం చొప్పున ప్రీమియం చెల్లించాలి.

పశువుల రకాన్ని బట్టి సాయం

వైఎస్సార్ పశు బీమా పథకం కింద పశుపోషకులు గరిష్ఠంగా ఐదు గేదెలు, 50 గొర్రెలు లేదా మేకలకు బీమా చేయించుకునే అవకాశం ఉంది. సంకరజాతి పశువులు, ఆవులు, గేదెలు, ఎద్దులు మరణిస్తే ఒక్కోదానికి రూ.30 వేలు, అలాగే దేశీయ పశుజాతి ఆవులు, గేదెలు, ఎద్దులు మృత్యువాత పడితే రూ.15 వేలు చొప్పున పరిహారం అందుతుంది. గొర్రెలు, మేకలు మరణిస్తే ఒక్కోదానికి రూ.6 వేల వరకు పరిహారం ఇస్తారు.

ఇవి తప్పనిసరి...

మూగజీవాలకు బీమా చేయించుకునేందుకు రైతులు బ్యాంకు పాస్‌బుక్, ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులు కులధ్రువీకరణ పత్రాలు వెంట తీసుకువెళ్లాలి. బీమా చేయించిన పశువులు, జీవాలకు తప్పనిసరిగా చెవిపోగు వేయించాలి. రోడ్డు, రైలు, అగ్నిప్రమాదాల్లో పశువులు మరణిస్తే ఎఫ్ఐఆర్ నమోదు చేయించాలి. బీమా చేయించిన పశువులు, జీవాలు మరణిస్తే వెంటనే సమీపంలోని రైతు భరోసా కేంద్రంలో పశువైద్య సహాయకునికి విషయాన్ని తెలియచేయాలి. లేదా 1962 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలి.

జిల్లాలో పశు సంపద..

పశువురకం	సంఖ్య
ఆవులు,ఎద్దులు	66,072
గేదెలు, దున్నలు	4,67,046
గొర్రెలు, పొటేళ్లు	4,69,424
మేకలు, పోతులు	1,56,291
కోళ్లు	45,69,354
మొత్తం	57,28,187

నిబంధనలు ఇలా ...

ఉత్పాదక దశలో ఉన్న, ఒకసారి ఈనిన 2-10 ఏళ్లలోపు ఆవులు, 3-12 ఏళ్ల మధ్య వయసున్న గేదెలు, ఒకటిన్నరేళ్ల పైబడిన మేలు జాతి దున్నలు, ఎద్దులు, రెండేళ్ల పైబడిన నాటు ఎద్దులు, దున్నలు, ఆరు నెలలు వయసు నిండిన గొర్రెలు, మేకలకు ఈ బీమా పథకం వర్తిస్తుంది. పదేళ్ల పైబడిన ఎద్దులు, దున్నలు, ఆరు నెలలలోపు శాశ్వత అంగవైకల్యానికి గురైన గొర్రెలు, మేకలకు ఈ పథకం వర్తించదు.

మూగజీవాలకు బీమా చేయించాలి



మూగజీవాలకు రైతులు తప్పనిసరిగా బీమా చేయించాలి. వైఎస్సార్ పశు బీమా పథకంపై పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. జీవాలు మరణించిన రోజుల్లోనే బీమా మొత్తం రైతు బ్యాంకు ఖాతాలకు జమ వుతుంది. పాడి రైతులందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా వారిలో చైతన్య పరుస్తున్నాం. ఆసక్తి ఉన్న పాడి రైతులందరూ వారి పరిధిలో ఉన్న రైతు భరోసా కేంద్రాల్లో గ్రామాల్లో పశువైద్యాధికారులను సంప్రదించి బీమా చేయించుకోవాలి.

– డాక్టర్ మంగు శ్రీనివాసరావు, ఏడీ, పశుసంవర్థక శాఖ, సత్తెనపల్లి.

నేడు రైల్వే బ్రిడ్జికి శంకుస్థాపన

రూ.52 కోట్లు మంజూరు

పిడుగురాళ్ల: ఏళ్ల నాటి రైల్వే బ్రిడ్జి సమస్యకు మోక్షం లభించింది. పిడుగురాళ్ల-జానపాడు మధ్యలో ఉన్న రైల్వే గేటు వద్ద తరచూ రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. దీనికి బ్రిడ్జి నిర్మాణమే శాశ్వత పరిష్కారమని భావించిన ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రైల్వే బ్రిడ్జి మంజూరుకు ఎనలేని కృషి చేశారు. రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్యే కాసు ఆదివారం శంకుస్థాపన చేయనున్నారు.

రూ.52 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం

పిడుగురాళ్ల-జానపాడు రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి రూ.52 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఇప్పటికే ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డు విస్తరణ పనులతోపాటు రోడ్డుకు అడ్డుగా ఉన్న చెట్లు తొలగించటం, విద్యుత్ స్తంభాలు మార్చటం, వాటర్ పైపులైన్‌లు మార్చటం వంటి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ రైల్వే బ్రిడ్జి నిర్మించటానికి సీఆర్ఐఎఫ్ నిధుల ద్వారా రూ.52 కోట్లు మంజూరయ్యాయి. కాంక్ట్ సిండికేట్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన గుత్తేదారులు ఈ పనులు చేయనున్నారు.



జానపాడు రోడ్డులో రైలు రాకతో నిలిచిన ట్రాఫిక్

చంద్రబాబు మాయలో పడొద్దు

- జనసేనకు ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి హితవు
- ఆసరా నాల్గవ విడత రూ.6.94 కోట్లు పంపిణీ

కారెంపూడి: కల్లిబొల్లి మాటలు, కుట్రలు కుతంత్రాలతో ఎల్లో మీడియా దుష్ప్రచారాలతో జనసేనను మభ్యపెట్టి వారి అండతో అధికారంలోకి రావాలని చంద్రబాబు నాయుడు విశ్వప్రయత్నం చేస్తున్నాడని ఆయన మాయలో పడి మరోసారి మోసపోవద్దని ప్రభుత్వ విప్, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (పీఆర్కే) ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కారెంపూడిలో శనివారం జరిగిన సభలో వైఎస్సార్ ఆసరా 4వ విడత రూ.6.94 కోట్ల చెక్కు పంపిణీ చేశారు. పీఆర్కే మాట్లాడుతూ 2014 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను దగా చేసిన చంద్రబాబును నమ్మితే మళ్లీ మోసమే చేస్తారని అన్నారు. చంద్రబాబుకు గతంలో పేద ప్రజలకు మేలు చేసిన చరిత్ర లేదన్నారు. రానున్న రెండు నెలల కాలం చాలా కీలకమైందని వారు చెప్పే మాటలు విని ప్రజలు మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తా, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగభృతి ఇస్తామని పచ్చిగా మోసం చేసిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. సామాజిక న్యాయాన్ని పాటిస్తున్న ఆదర్శవంతుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నరసరావుపేట ఎంపీ టికెట్ అనిల్‌కుమార్‌యాదవ్‌కు ఇచ్చారన్నారు. మండలంలోని వైకుంఠపురం గిరిజనులు 18 మందికి 40 ఎకరాల వ్యవసాయ భూములకు పట్టాలను డీటీ కీర్తిసుధా స్రవంతి ప్రభుత్వ విప్ పీఆర్కే చేతుల మీదగా పంపిణీ చేయించారు. వైఎస్సార్ ఆసరా క్యాలెండర్‌ను పీఆర్కే ఆవిష్కరించారు. సభ ప్రారంభానికి ముందు దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాలకు డ్వాక్రా మహిళలు క్షీరాభిషేకం చేశారు. డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్ పల్నాడు జిల్లాలో వైఎస్సార్ ఆసరా కింద ఇప్పటి వరకు రూ.764.51 కోట్ల రుణ మాఫీ జరిగిందన్నారు.

ఎంపీపీగా సావిత్రి ప్రమాణం

మొదట కారెంపూడి నూతన ఎంపీపీగా బొమ్మిన సావిత్రిఅల్లయ్యచే ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి ప్రమాణస్వీకారం చేయించారు. నూతన ఎంపీపీ సావిత్రిఅల్లయ్య దంపతులు, పార్టీ నాయకులు ప్రభుత్వ విప్ పీఆర్కేను భారీ గజమాలలతో సన్మానించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, జెడ్పీటీసీ షేక్ షఫీ, జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ షేక్ అక్బర్, పల్నాడు జిల్లా యూత్ కార్యదర్శి శివారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కొంగర సుబ్రమణ్యం, సర్పంచ్ ప్రమీలాభాయితేజానాయక్, కొమ్మిరెడ్డి గురవారెడ్డి,చిలుకూరి చంద్రశేఖరరెడ్డి, మహిళా కన్వీనర్ మేకపోతుల వెంకటరమణ, అంతరగడ్డ ఏసోబు, దుర్గి, మాచర్ల యార్డుల చైర్మన్‌లు వెలిదిండి గోపాల్, తాడి వెంకటేశ్వరరెడ్డి, మాజీ చైర్మన్‌లు యరబోతుల శ్రీనివాసరావు, శెట్టిపల్లి యలమంద, మాజీ ఎంపీపీ పంగులూరి చినవెంకటనర్సయ్య, పంగులూరి రామకృష్ణయ్య, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ

నరసరావుపేట: జిల్లాలోని దివ్యాంగులు, అంధులు, ట్రాన్స్‌జెండర్‌ల సమస్యలను ప్రత్యేకంగా పరిశీలించి పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శనివారం దివ్యాంగులు, అంధులకు సంబంధించి వారి సమస్యల పరిష్కారానికి కలెక్టర్ నిర్వహించిన వినూత్న కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. దీనికి జిల్లా నలుమూలల నుంచి హాజరైన వారు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 70 అర్జీలు అందజేశారు. తొలుత లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దివ్యాంగుల వద్దకు స్వయంగా వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తమ సమస్యలను పరిష్కరించేందుకు ఇంతటి గొప్ప కార్యక్రమం రూపొందించిన కలెక్టర్‌ను దివ్యాంగులు, అంధులు అభినందించి హర్షం వ్యక్తం చేశారు. సమావేశానికి విచ్చేసిన వారికి భోజన వసతి కల్పించారు. ప్రతి నెలా నాల్గవ తేదీన వీరి కోసం ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. డీఆర్వో కె.వినాయకం, జిల్లా డిజేబుల్ వెల్ఫేర్ ఏడీ సువార్త, డీఎండీహెచ్ఓబి.రవి, డీసీహెచ్ఎస్ బీవీ.రంగారావు పాల్గొన్నారు.

హత్య కేసు ఛేదించిన పోలీసులు!

సత్తెనపల్లి: రియల్ ఎస్టేట్ బ్రోకర్ రామకృష్ణ దారుణ హత్య కేసును 24 గంటలు గడవక ముందే పోలీసులు ఛేదించారు. రామకృష్ణ తనకు పరిచయస్తురాలైన నాగలక్ష్మితో నాలుగేళ్లుగా సహజీవనం చేస్తున్నాడు. గతంలో రంగా కాలనీలో ప్లాట్ విక్రయించగా వచ్చిన నగదులో నుంచి ఆమెకు రూ.3 లక్షలు ఇచ్చినట్లు సమాచారం. నాగలక్ష్మి కుమారుడు పోతురాజు తనకు రూ.లక్ష ఇవ్వమని రామకృష్ణను కోరుతున్నాడు. అయితే రామకృష్ణ, పోతురాజు కలిసే నిత్యం మద్యం తాగుతుంటారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి 11 గంటలకు సమయంలో నాగలక్ష్మికి బిర్యానీ ప్యాకెట్ ఇచ్చి మద్యం తాగి వస్తానని వెళ్లిన రామకృష్ణ తిరిగి రాలేదు. రామకృష్ణ, నాగలక్ష్మి కుమారుడు పోతురాజు కలిసి ఆర్‌అండ్ బీ బంగ్లా వెనుక వైపు మద్యం తాగారు. వారి మధ్య నగదు విషయం ప్రస్తావనకు రావడంతో తన వద్ద లేవని రామకృష్ణ చెప్పడంతో కోపంతో పోతురాజు తన వద్ద ఉన్న పందులు కోసే కత్తితో రామకృష్ణ గొంతు కోశాడు. జరిగిన ఘటనను తల్లి నాగలక్ష్మికి వివరించాడు. సత్తెనపల్లి పోలీసులు పూర్తి స్థాయిలో దర్యాప్తు జరిపి కేసును 24 గంటలు గడవక ముందే ఛేదించారు. ప్రస్తుతం వారిరువుర్ని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. ఒకటి, రెండు రోజుల్లో పక్కా ఆధారాలతో పోలీసులు అరెస్ట్ చూపనున్నట్లు సమాచారం.

'ఆడుదాం ఆంధ్రా' విజేతలకు బహుమతులు


విజేతలుగా నిలిచిన క్రీడాకారులతో కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: స్థానిక సత్తెనపల్లి రోడ్డులోని డీఎస్ఏ స్టేడియంలో శనివారం సాయంత్రం ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి క్రీడలు ముగిశాయి. ముఖ్యఅతిథి జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ బహుమతులు క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్ జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు కప్‌లను అందజేశారు. పురుషుల విభాగంలో క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్ క్రీడల్లో జిల్లా మొదటి విజేతగా నరసరావుపేట, క్రికెట్‌లో ద్వితీయ, తృతీయ స్థానాలను పెదకూరపాడు, గురజాల టీములు దక్కించుకున్నాయి. షటిల్ బ్యాడ్మింటన్‌లో ద్వితీయ, తృతీయ స్థానాలను చిలకలూరిపేట, వినుకొండ, కబడ్డీలో మొదటిస్థానం వినుకొండకు దక్కగా సత్తెనపల్లి, చిలకలూరిపేట జట్లు ద్వితీయ, తృతీయ విజేతలుగా నిల్చారు. ఖో-ఖో విభాగంలో మొదటి విజేతగా మాచర్ల జట్టు, ద్వితీయ, తృతీయ విజేతలుగా వినుకొండ, సత్తెనపల్లి జట్లు గెల్చుకున్నాయి. వాలీబాల్ విభాగంలో ద్వితీయ, తృతీయ విజేతలుగా గురజాల, సత్తెనపల్లి జట్లు కప్‌లు సాధించాయి.

మహిళల విభాగంలో...

మహిళల విభాగంలో బ్యాడ్మింటన్, కబడ్డీ, వాలీబాల్ క్రీడల్లో గురజాల మొదటి విజేతగా నిలిచింది. క్రికెట్‌లో మొదటి విజేతగా చిలకలూరిపేట, ద్వితీయ, తృతీయ స్థానాల్లో వినుకొండ, గురజాల నిలిచాయి. బ్యాడ్మింటన్‌లో ద్వితీయ, తృతీయ స్థానాల్లో సత్తెనపల్లి, చిలకలూరిపేట జట్లు, కబడ్డీ ఆటలో ద్వితీయ, తృతీయ విజేతలుగా చిలకలూరిపేట, సత్తెనపల్లి జట్లు, ఖో-ఖో క్రీడలో జిల్లా ప్రథమ విజేతగా వినుకొండ, ద్వితీయ, తృతీయ విజేతలుగా మాచర్ల, సత్తెనపల్లి, వాలీబాల్‌లో ద్వితీయ, తృతీయ విజేతలుగా సత్తెనపల్లి, నరసరావుపేటలకు చెందిన జట్లు నిలిచాయి. క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీలలో ప్రథమ బహుమతి రూ.60 వేలు, ద్వితీయ బహుమతి రూ.30 వేలు, తృతీయరూ.10 వేలు అందించారు. షటిల్ బ్యాడ్మింటన్‌లో ప్రథమ విజేతకు రూ.35 వేలు, ద్వితీయ, తృతీయ విజేతలకు రూ.20 వేలు, రూ.10 వేలు బహుమతులు అందజేశారు.